కథా నిలయం
3572
శ్రీకాకుళం

# జారుడు బండ.

ప్రబంధ నాయిక కాదామె. పల్లెసీమలో విరబూసిన సిరిమల్లె అంత కంటే కాదు.

గుమ్మడికాయ మొహంనిండా శనగపప్పు గింజ లారబోసినట్టు స్ఫోటకపు మచ్చలు. కురచగా ఉంటుంది. తైల సంస్కారానికి నోచుకోని జుట్టు మసిబూసినట్టున్న దేహచ్ఛాయకు అతికినట్టుంది. ఒకరోజు ఒక వీధిలో కనిపిస్తే వారం రోజుల దాకా అక్కడ కన్పించదు. ఆదిభిక్షువుకు అక్షరాలా వారసురాలు. అనుమానంలేదు. వృత్తి భిక్షాటనే. ఏ గృహిణైనా పిలిచి ఏదన్నా పంజెపితే ఓపిగ్గా చేసిపెడుతుంది. ప్రతిఫలంగా ఏదన్నా ముట్టజెపితే ఆమె కళ్లు మతాబాల్లా వెలిగిపోతాయి.

“ఆ ముష్టిదానికి పెళ్లి పెటాకుల్లేవుగదా.... మూన్నెల్ల కడుపు తీయించుకుందటా!” మురళి చెవిలో ఊదాడు ఆప్తమిత్రుడు గణేశ్” ఉపనయనమప్పుడు కన్నతండ్రి బ్రహ్మోపదేశం చేసినట్టు.

తెగి నేలమీదపడిన ముప్పయిమూడు కే.వీ.ల కరంటు తీగమీద కాలుపడ్డట్టు షాక్ కొట్టింది మురళికి. రెండునిమిషాలు నోరెల్లబెడితేకాని నోటెమ్మట మాటరాలేదు.

“ఇంపాజిబుల్! పగలు కన్పిస్తే రాత్రి కలలోకొచ్చి జడిపించే అవతారానికి కడుపు రావటమూ, తీయించుకోడవడము గూడానా? కోతలకైనా ఓ హద్దంటూ ఉండాలి! అభ్యంతరాలన్నింటినీ నిర్దాక్షిణ్యంగా తోసేసి ఎన్నికల ఫలితాన్ని ప్రకటించిన రిటర్నింగ్ ఆఫీసర్లా కొట్టి పారేశాడు.

గణేశ్ అహం దెబ్బతింది. బుర్ర చిర్రుమంది. 'అప్త మిత్రుడొకడు జర్నలిజం వెలగబెడుతున్నాడు. ఓ సంచలన వార్త వాడితో రాయించి కీర్తిశిఖరాలకెక్కిద్దామంటే.... అలా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడం అవమానం. నీకిష్టముంటే ఆ న్యూసు కవరు చేస్కో కష్టమనిపిస్తే ఛావు.'

విలేఖరి విశ్వాసం లేచి కూచుంది.

... ... ...

ఎండాకాలం చిటపటలాడుతుంది. కన్నెపిల్లకు కడుపొచ్చిందన్న కఠోరసత్యం విని మండిపడుతున్న కన్నతండ్రిలాగున్నాడు సూర్యుడు. ఆరాతీసి వార్త రాసి తీరాలనే కుతూహలం పెరిగింది మురళిలో. ఆవిడెక్కడుందో జాడలు వెతికే సరికి తలప్రాణం తోకకొచ్చింది.

పట్టణానికి దూరంగా.... ఖాళీగా పడున్న వాటర్‌వర్క్స్ సిమెంటు పైపుల్లో స్థిర నివాస మేర్పరచుకొన్న బడుగువర్గాల ఓటర్లు పిల్లలనక్కడే వదిలేసి వృత్తుల్లోకెళుతున్నారు. తాను వెదుకుతున్న ఊర్వశి పైపులోనే ఒంటరిగాఉన్నందుకు తేలిగ్గా నిట్టూర్చాడు మురళి.

"ఊర్వశి అంటే మీరేనా?"

తననొకరు అంతగౌరవంగా పిలవడమా! నమ్మలేకపోయింది. "ఔను....నేనే. ఊళ్లోకి పోవాలే."

తనకు తాను పరిచయం చేసుకుని వచ్చినపని చెప్పేశాడు మురళి. కెమెరా సర్దుకుంటూ. ఊర్వశి మొహం పంచరంగుల చిత్రమైంది.

"వద్దు....వద్దు" మొహం అరచేతుల్లో దాచుకుంది ఫోటో తీస్తాడేమోనని.

"ఏం... ఎందుకూ?"

"నాకవసరం లేదు బాబూ!"

"నాకవసరముంది. మీకు న్యాయం జరిగేలా చూడాలనుంది. మీకు జరిగిన అన్యాయం పత్రికల్లో వార్తగా వస్తే న్యాయం జరిగి తీరుతుంది."

"అవన్నీ ఏమొద్దు".

"ప్లీజ్ నాఉత్సాహాన్ని చంపకండి...."పైపులో ఓమూల కూర్చుండి అర గంట బతిమాలాడు. ఆమె పెదవులు సంకోచంతో వణికాయి. మనసు మెత్తబడింది.

"పత్రికకు పంపనంటే చెప్తా."

ఇందాకా వచ్చి వట్టి చేతులతో పోవడం బాగనిపించడంలేదు మురళికి. ఆసక్తిగూడా రెట్టింపైంది.

"సరే....చెప్పండి."

... ... ...

"మాది విజయనగరం. ఓ దుర్మార్గుడు నన్ను ప్రేమిస్తున్నాని నమ్మించి హైదరాబాదు తీసుకొచ్చాడు. చాకచక్యంగా నన్నో ఆటబొమ్మగా వాడుకుని మూడొందల రూపాయలకు మెహందిలో అమ్మేశాడు. కొన్నవారికి నావల్ల గుడ్డి గవ్వ ఆదాయంగూడా రాలేదు. అందరూ అసహ్యించుకున్నారు. తిండి దండగని తన్ని గెంటేశారు. తిరిగి మా ఊరు వెళ్లేందుకు డబ్బుల్లేవు. ఒకవేళ వెళ్లినా నా సవతి తల్లి నన్ను ఇంట్లోకి రానీయదు. ఏదన్నా పని దొరుకుతుందేమోనని తెగ దిరిగాను. ఫలితం శూన్యం. ఆకలి పేగుల్ని కొరికేస్తుంది. ఒక హోటల్లో సుష్టుగా భోంచేసి "బిల్లుకు డబ్బులులేవు. ఏదన్నా పనుంటే చెప్పండి చేస్తా"నన్నాను.

"ఈ దయ్యంమొహాన్ని హోటల్లుంచుకుంటే పనోళ్లంతా పారిపోతారు" అని వీపుమీద నాలుగు వాయించి పంపించారు.

నడుచుకుంటూ ఈ ఊరొచ్చాను. ఇక్కడి వాళ్లను బతిమాలితే ఈ ఆశ్రయం చూపించారు. వారానికేడు రోజులైతే ఒక్కోరోజు ఒక్కో వీధిలో అడుక్కుంటు న్నాను. ఈ ఏడు వీధులు తప్ప ఎనిమిదో వీధికెళ్లను. ఏడు వీధులు బాగా తెలిసి పోయినై. మొదట నాకు ముష్టి వేసేందుక్కూడా అసహ్యించుకునేవారు. ఒకరోజు ఒకబ్బాయి లారీకింద పడబోతుంటే ప్రాణాలకు తెగించి రక్షించాను. అప్పట్నుంచా వీధిలోని జనం నన్నసహ్యించుకోవడం మానేశారు. ఎవరైనా ఇల్లూడ్వడం అంట్లు తోమడం లాంటి చిల్లరపనులు చెప్తే సంతోషంగా చేస్తున్నాను.

ఏ అందానికి నోచుకోని నాకు చిన్నప్పుడే అమ్మవారు జ్వరం వచ్చి మొహాన్ని మచ్చలతో కప్పేసింది. ఆ జ్వరంతో అప్పుడు చచ్చినా బావుండేది."

ఊర్వశి కళ్లల్లో కన్నీటి తెరలు మెరిశాయి. కడుపులో దేవినట్టయింది మురళికి.

"చావు పుట్టుకలు మన చేతుల్లో లేవుగదా!"

ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా గడ్డకట్టుకు పోయాయి. ఊర్వశి తల వంగి పోయింది.

"మీరు చెప్పాల్సింది ఇంకా ఉంది గదూ!

"ఉంది బాబూ!" సర్దుక్కూచుంది. "ఆరోజు ఒకింటాయన మాఆవిడ రమ్మం టుందని ఇంట్లోకి రమ్మన్నాడు వెళ్లాను. ఇంట్లో ఆయన తప్ప ఇంకెవ్వరూ లేరు.

టేబుల్‌మీద ఖాళీ చేసిన బ్రాంది సీసా, గ్లాసులున్నాయి, తాగి పారేసిన సిగరెట్ పీకలున్నాయి - టేబుల్ చుట్టూ.

"అమ్మగారెక్కడ?" అనడిగేలోపల వెనకనుంచి నా చీర లాగిపారేశాడు. పుట్టెడు భయమేసింది. అతని కళ్లు చింత నిప్పుల్లాగున్నాయి. బలాన్నంతా కాళ్ల ల్లోకి తెచ్చుకొని బయటికెళ్లాలనుకున్నా, తాళం వేశాడెప్పుడో. శక్తిమేరకు కేకలు వేస్తూ ఎదిరించాను. సింహం చేతితో చిట్టెలుకలాగ ఆకలి పులికి బలైపోయింది నా శీలం.

బయట కొచ్చింతర్వాత భగభగ మండే గుండెల్తో పోలీసు స్టేషన్‌కు పరుగెత్తాను న్యాయం కోసం. యస్సై లేడు. హెడ్డున్నాడు. నేను చెప్పిందంతా విని "నువ్వో అప్సరసవనీ.... నిన్ను.... నిన్ను రేప్‌చేశాడా?" పగిలిన సోడా బుడ్డోలె వెకిలిగా నవ్వేశాడు.

"నేను చెప్పేది నిజం...." అరచిన.

"ఇంటి దగ్గర అప్పటికి దరఖాస్తు రాయిస్తా. ఇక్కడ తీరిక లేదు." మరేదో పనిమీద బయటకెళ్ళాడు.

హెడ్డింటికెళ్లాను. అప్పటికే అరసీసా విస్కీ ఖాళీ చేసినట్టుంది. తూలుతున్నట్లనిపించింది పరిస్థితి గమనించి పారిపోయే ప్రయత్నం చేశాను. తలుపేశాడు.

" నాపెళ్లాం పుట్టింటికెళ్లి మూన్నెళ్లయింది" అంటూ మీద పడిపోయిండు. మరోసారి చెడిపోయానక్కడ. ఎవరితో చెప్పాలి? నాఖర్మ ఇంతేనని ఊరుకున్నా.

మూన్నెళ్ల తర్వాత ఓరోజు మైకం కమ్మి వీధిలో పడిపోయాను. నేను లారీ నుండి రక్షించిన అబ్బాయి తండ్రి నన్ను హాస్పిటల్‌కు చేర్పించాడు. డాక్టర్ పరీక్షలవీ చేసి నాకు మూన్నెళ్ల గర్భమనేశాడు. నెత్తిమీద పిడుగుల వర్షం కురిసింది. ఐనా చేసేదేముంది? అందరితోపాటు నన్ను చెరిచిన ఇద్దరు పెద్దమనుషులకీ విషయం తెలిసింది. వాళ్ళిద్దరు పోటీలు పడి మరొ నెలరోజుల్లోగా నాకడుపు తీయించారు. ఈ విషయమెవరికన్నా చెబుతే ప్రాణాలు తీస్తామన్నారు-"

ఊర్వశి మొకాళ్లు ముడుచుకుని వీపు పైపుకానించి కూచుంది. చూపులు శూన్యంలోకి చొచ్చుకు పోతున్నాయి. కళ్లల్లోంచి వెలువడిన నీటి బొట్లు చెక్కిళ్ల మీది స్ఫోటకం గుంటల్లోకొచ్చేసి మెరిశాయి.

గుండెల్నెవరో గట్టిగా పిండేస్తున్నట్లనిపించింది మురళికి.

"ఈ అన్యాయం పత్రికాముఖంగా పదిమందికి తెలిస్తే ఏ మహిళా సంఘమో, స్వచ్ఛంద సేవా సంస్థో ముందుకొచ్చి మీకు న్యాయం చేకూర్చవచ్చు."

"ఏం న్యాయం చేకూర్చుతారు? పోయిన నా శీలాన్ని తెచ్చిస్తారా?" సూటి ప్రశ్న గుండెలకు తాకింది.

"తెచ్చివ్వరు, కాని మరో విధంగా సాయం చెయ్యొచ్చు"

"అంటే....?"

"ఆందోళన లేవదీయొచ్చు. అధికారుల్ని నిలదియ్యొచ్చు, మీ సర్వస్వం దోచుకున్న వాళ్లను కోర్టుకీడ్చి శిక్షపడేలా చెయ్యొచ్చు."

విరాగిలా నవ్వింది ఊర్వశి. గాలి తరంగమొకటి పైపులోకొచ్చి ఆమె ముంగురుల్ని మొహమ్మీద కప్పేసింది. వాటిని సవరించుకునే ప్రయత్నం చెయ్యకుండా

"వాళ్లకు శిక్ష పడితే నాకొరిగేదేముంది? పైగా నాకే నష్టం" అన్నది. వంచిన తల ఎత్తకుండా.

"నష్టపోయేందుకింకేముందని?"

గోచీ తప్ప మరేమి లేని సన్యాసి తననెవరో దోచుకుంటారని భయపడినట్టనిపించింది– మురళికి.

"లేదా....?"

"ఏముంది?" భృకుటి ముడిపడింది.

"నేను చెడిపోయిన దాన్నని నలుగురికి తెలిస్తే నాకెవ్వరూ ముష్టి వెయ్యరు. కిలాడిననీ, మొగాళ్లను చెడగొడ్తానని మొహమ్మీదే ఊమ్మేస్తారు. మెడలుపట్టి గెంటిస్తారు. ఇలాగే గమ్మునుంటే కొన్ని రోజుల్లో ఏ తల్లయినా తనింట్లో నాకు పనిప్పించవచ్చు. నా బ్రతుక్కో దారి దొరకొచ్చు."

"ఊర్వశిగ్గూడా జీవితమ్మీదా, భవిష్యత్తు మీదా ఆశలున్నాయన్న మాట." వచ్చే నవ్వును ఆపుకోక తప్పలేదు.

"ఐతే ఆరోజు పోలీస్ స్టేషనెందుకెళ్లినట్టో?"

"అప్పుడావేశంలో ఉన్నాను. ఆవేశానికి శిక్షగూడా అనుభవించాను గదా!"

(12–7–1992 ఆదివారం ఆంధ్రప్రభ.)